మల్లేపల్లిలో డ్రైనేజీ మరమ్మతులు

మెహిదీపట్నం మార్చి 5 : ప్రజలకు డ్రైనేజీ సమస్యలేకుండా జీహెచ్ఎంసీ సర్కిల్-12 అధికారులు డ్రైనేజీ లైన్ల నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆదేశాల మేరకు మల్లేపల్లి డివిజన్ ఆగాపుర ప్రాంతంలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నింబోలి అడ్డ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులు కోర్సులు పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట కృష్ణ, ముత్యాలరావు, ప్రశాంత్ నిమ్మర్, సత్యపాల్‌సింగ్, భాస్కర్, ప్రదీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జూపార్కులో జంతువులకు తాటాకు పందిళ్లు

- మండుతున్న ఎండలకు ముందస్తుగా 'చల్లటి' ఏర్పాట్లు
- ముమ్మరం చేసిన జూపార్క్ అధికారులు

చాంద్రాయణగుట్ట మార్చి 5: ఎండలు మండుతుండటంతో నగరంలోని నెహ్రూ జులాజికల్ పార్కులో జంతువులు సేద తీరేందుకు అధికారులు చల్లని తాటాకు పందిళ్లను సిద్ధం చేశారు. సందర్శకులు కూడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జూపార్కులో ఏ కాలానికి ఆ కాలంలో జంతువుల సంరక్షణ కోసం అధికారులు చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే ఎండలు ముదరడంతో జూపార్క్‌లోని అన్ని ఎన్‌క్లోజర్లలో తాటాకు పందిళ్ళు, అవసరమైన ప్రాంతాల్లో స్ప్రింక్లర్లు, కూలర్ల ఏర్పాటు, అంతర్గత గదులు, చీకటి గదుల్లో ఏసీల ఏర్పాటు పనులను అధికారులు పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జూ క్యూరేటర్ వసంత నేతృత్వంలోని అధికారులు జంతువుల హాస్పిటల్ ఏరియాల్లో చల్లగా ఉండేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నారు. సింహాలు, పులులు, పాములు, మొసల్లు, జింకలు, పాములు తదితర ఎన్ క్లోజర్లలో తాటాకు పందిళ్ళ పనులు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గతంలో ఉన్న తాటాకులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడం, ఏనుగులను కడిగేందుకు, సింహాలకు వేడి తగలకుండా ఉండేందుకు గాను కూలర్ల ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మాసంలో ఈ పనులను ప్రారంభించే వారు కానీ ఈ సంవత్సరం మార్చి నెలలో ఎండలు ముదరడంతో పనులు ప్రారంభించారు.

తాటాకు పందిళ్లను ఏర్పాటు చేస్తున్న జూ సిబ్బంది

సందర్శకులకు ఇబ్బందులు లేకుండా...

జూపార్కుకు వేసవిలో సందర్శకుల తాకిడి అధికమవుతుంది. ఈసారి ఎండలు అధికంగా ఉండటంతో సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా జూపార్క్ అధికారులు టికెట్ కౌంటర్ వద్ద ఎన్‌క్లోజర్లలో తిరిగే సమయంలో ఎండ తగలకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటర్ 'ప్రథమ' పరీక్షలు ప్రారంభం

కాచిగూడ : ఓ కేంద్రంలో పరీక్షలకు హాజరైన ఇంటర్మీడియట్ విద్యార్థులు

కాచిగూడ, మార్చి 5: కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పీఎస్ పరిధిలోని ఆరు సెంటర్లలో విద్యార్థులు సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. చాదర్‌ఘాట్‌లోని ఆర్‌జీ కేడియా కళాశాల, బర్కత్‌పురాలోని శ్యామలాదేవి జూనియర్ కళాశాల, ఓల్డ్ సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల, కేశవ్ స్మారక జూనియర్ కళాశాల, కాచిగూడలోని తపస్య కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లో

మెహిదీపట్నం : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లోని మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ లంగర్ హౌస్, టోలిచౌకి, నానల్‌నగర్, మల్లేపల్లి, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. ఉదయం పలు ప్రాంతాల్లో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందుగానే చేరుకోవడంతో మొదటిరోజు సజావుగా సాగాయి.

మెహదీపట్నంలో పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థులు

డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీబీఏ, బీఏ, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్మెంట్, బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

అంబర్‌పేటలో లోప్రెషర్ వాటర్‌తో ఇక్కట్లు

అంబర్‌పేట/ కాచిగూడ, మార్చి 5: ఎండాకాలానికి ముందే అంబర్ పేట నియోజకవర్గంలోని పలు డివిజన్లలో లోప్రెషర్ వాటర్ సమస్య నెలకొంది. ప్రధానంగా నియోజకవర్గంలోని గోల్నాక, వెంకటేశ్వరనగర్, అంబర్‌పేట, దుర్గానగర్, అలీకేఫ్ చౌరస్తా, ప్రేమ్‌నగర్, కాచిగూడ డివిజన్‌లోని సునార్ గల్లి, మోతీ మార్కెట్, ఎంఏ నగర్, బండల బస్తీ, నింబోలి అడ్డ, చెప్పల్ బజార్ మజీద్, ప్రాంతాల్లో లోప్రెషర్ వాటర్ సమస్య ఉన్నది. బాగ్ అంబర్‌పేట్‌లోని పోచమ్మ బస్తీ, తదితర ప్రాంతాల్లోనూ నీటి సమస్య ఉన్నది. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాచిగూడలో లోప్రెషర్‌తో వస్తున్న తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

వ్యర్థాలు తరలించండి మహాప్రభో..

చార్మినార్, మార్చి 5: డ్రైనేజీ మరమ్మతులు నిర్వహించి వ్యర్థాలను తొలగించకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గౌలిపుర డివిజన్ శ్రీరామ్‌నగర్ రోడ్డులో కొద్ది రోజుల క్రితం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు కృషి చేశారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది డ్రైనేజీల నుంచి తీసిన వ్యర్థాలు రోజుల తరబడి తొలగించకపోవడంతో స్థానికులు దుర్వాసనతో సతమతమవుతున్నారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేసిన వారికి చలానా విధిస్తామంటున్న జీహెచ్ఎంసీ అధికారులు వారి తప్పిదాలను ఎలా సమర్థించుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

కులగణనపై ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలి

కాచిగూడ, మార్చి 5: జనాభా గణనలో భాగంగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వేలాది మందితో జాతీయస్థాయిలో ఉద్యమిస్తామని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల మనోభావాలను గ్రహించి మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కుల గణన తీర్మానం చేసి కేంద్రానికి పంపించి తన నిజాయితీని నిరూపించుకున్నాడని గుర్తుచేశారు. దేశ జనాభాలో బీసీలు 56శాతం ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం కుల గణన చేపట్టి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీలోని సీనియర్ బీసీ నాయకులంతా కులగణన కోసం ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి తేవాలని కోరారు. ఆయన వెంట పలువురు బీసీ దళ్ కార్యకర్తలు ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న కుమారస్వామి

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం.. : ఎమ్మెల్యే

మెహిదీపట్నం, మార్చి 5 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకి నానల్ నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి : కార్పొరేటర్

గోల్నాక, మార్చి 5 : ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. డివిజన్‌లోని పటేల్ బాడాలో చెత్త పేరుకుపోయిందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన బుధవారం సమస్యను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పారిశుధ్య సిబ్బంది రప్పించి చెత్త, వ్యర్థాలను శుభ్రం తొలగింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పటేల్‌బాడాలో వీధులను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్

మల్లేపల్లిలో దోమల నివారణకు చర్యలు

మెహిదీపట్నం, మార్చి 5 : కాలనీల్లో దోమల నివారణకు జీహెచ్ఎంసీ సర్కిల్-12 ఎంటమాలజీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం మల్లేపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ కోసం రసాయనాలను పిచికారీ చేయించారు. సిబ్బంది ఇండ్ల మధ్య, పరిసరాల్లో దోమలు నిల్వ ఉండే ప్రాంతాల్లో రసాయనాలు పిచికారీ చేశారు.

రైల్వేస్టేషన్‌లో ల్యాప్‌టాప్ మాయం

కాచిగూడ మార్చి 5: కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికురాలి ల్యాప్ టాప్ మాయమైంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా ప్రాంతానికి చెందిన రిచర్డ్ కుమార్తె రేచల్ పేటల్లి(36) బుధవారం మైసూర్ రైలులో వెళ్లేందుకు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ప్లాట్‌ఫామ్ రెండులో ఖరీదైన ల్యాబ్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను పెట్టి టికెట్ తీసుకోవడానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ల్యాప్‌టాప్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో కాచిగూడ రైల్వేపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే సీఐ తెలిపారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ www. osmania. ac. in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన సూచించారు.

సెంట్రల్ లైబ్రరీలో మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలి

- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సుల్తాన్‌బజార్, మార్చి 5 : అఫ్జల్‌గంజ్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో మరమ్మతు పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా సందర్శించి గ్రంథాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో రూ. 5.5 కోట్లతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. రిజిస్టర్‌లను, టిక్స్ బుక్స్ విభాగం, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్స్,జిరాక్స్ మిషన్, పాఠ్యపుస్తకాల విభాగాలను స్వయంగా పర్యవేక్షించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు తెలుగులో ఉన్నాయా? ఇంకా ఏమైనా పుస్తకాలు కావాలా? అని ముఖ్య గ్రంథపాలకులని అడిగి తెలుసుకున్నారు. యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థుల కోసం వారికి కావలసిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడారు. అభ్యర్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసరంగా కావలసిన వాటి కోసం ప్రతిపాదనలు సమర్పించాలని గ్రంథాలయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీహరి శంకర్, హెచ్ఎండీ డీఈ అబిలాశ్, గ్రంథాలయ చీఫ్ లైబ్రరీయన్, పీజీవీ రాణి, సీనియర్ లైబ్రేరియన్ కేసరి హనుమంత్, లైబ్రరియన్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు

సెంట్రల్ లైబ్రరీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గోల్నాకలో మురుగు సమస్య పరిష్కారం

తులసినగర్ కాలనీలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

గోల్నాక, మార్చి 5 : గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉన్నది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదేశాలతో బుధవారం తులసినగర్‌లో పారిశుధ్య సిబ్బంది మాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను శుభ్రం చేశారు. పనులను బీఆర్ఎస్ నాయకుడు పోత్నక్ సంతోష్ తదితరులు పర్యవేక్షించారు.

ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ లో ఫోటో ఎగ్జిబిషన్

జేఎన్ఏఎఫ్ఏయూలో బుధవారం రెండో రోజు సెమినార్‌లో పాల్గొన్న సినిమాటోగ్రాఫర్ ఎంవీ రఘును సన్మానించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జీ మధుకర్, సీఎఫ్ఏ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎల్ ఆనంద్‌రావు, ఫొటోగ్రఫీ విభాగాధిపతి ఏఆర్ కమల్‌రాయ్, ఎన్ హరీశ్, జితేందర్ హరి, విద్యార్థులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, మార్చి 5

పటేల్‌నగర్‌లో మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం

సుల్తాన్‌బజార్, మార్చి 5 : నాంపల్లి పటేల్‌నగర్‌లో మెకానిక్ షెడ్డులో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. బేగంబజార్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి గాంధీభవన్ వెనుక పటేల్‌నగర్ బస్తీలో బార్ మోటర్స్ మెకానిక్ షెడ్డు యజమాని ముఖేశ్ యధా ప్రకారంగా మంగళవారం రాత్రి రాత్రి 9 గంటల ప్రాంతంలో షెడ్డును మూసి ఇంటికెళ్లాడు. అనంతరం షెడ్డులో నుంచి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించడంతో భయాందోళనకు గురైన స్థానికులు బేగంబజార్ పోలీసులు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. గౌలిగూడ అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఫైర్ ఆఫీసర్ సుధాకర్ సిబ్బందితో కలిసి అరగంట పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. విషయం తెలిసిన వెంటనే బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఎస్సైలతో కలిసి ఘటనా స్థలిని సందర్శించారు. ప్రమాదంలో బాష్పపు పనిముట్టు, డీజిల్ వాహనాలకు బిగించే పరికరాలు మంటల్లో కాలిబూడిదయ్యాయని షెడ్డు యజామని తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు ఫిర్యాదు చేయకపోవడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మెకానిక్ షెడ్డులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సన్మానం

నూతన అధ్యక్షుడు సురేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఆర్కే బాబు,తదితరులు

కాచిగూడ, మార్చి 5: బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏ.సురేశ్ గౌడ్ అన్నారు. గోల్నాక డివిజన్ మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సురేశ్‌గౌడ్‌ను బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్కే బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బస్తీలో నెలకొన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భూపతి లక్ష్మణ్, రెడపాక రాము, విజయకుమార్, అంబటి రవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సుల్తాన్‌బజార్ మార్చి 5 : విజయనగర్ కాలనీలో గతంలో కొనసాగిన ప్రభుత్వ పాఠశాల స్థలంలో బుధవారం హౌసింగ్ బోర్డు అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ఇటీవల కొందరు కబ్జా చేసేందుకు యత్నించారు. ఈ విషయాన్ని స్థానికులు హౌసింగ్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు ఆక్రమణకు గురైన పాఠశాల భవన ప్రాంగణంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



అక్యూపంక్చర్ నాచురోపతి ఉచిత వైద్య శిబిరం



చాంద్రాయణగుట్ట, మార్చి 5 : పాతబస్తీ ఛత్రినాక వద్ద గల చారిత్రక చిత్రగుప్త దేవాలయంలో బుధవారం అక్యూపంక్చర్ నాచురోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, సోనమ్ తదితరులు ప్రజలకు సేవలందించారు.

ఉస్మానియాలో ఇన్‌ఫెక్షన్ల నివారణకు విశేష కృషి

- ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్

సుల్తాన్ బజార్, మార్చి 5 : పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ పేర్కొన్నారు. బుధవారం ఉస్మానియా దవాఖాన ఆడిటోరియంలో దవఖాన ఇన్‌ఫెక్షన్స్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. దవాఖానలోని అన్ని విభాగాల్లో వైద్య చికిత్స పొందుతున్న రోగులకు ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెందకుండా నియంత్రించడంతో పాటు నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేషంట్ కేర్‌తో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన వివరించారు. వైద్య సిబ్బందికి నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించి ఇన్ఫెక్షన్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టర్ ద్వారా నర్సులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్‌ని మల్టీ డిసిప్లినరీ కమిటీ చైర్మన్‌గా వైద్యులు నియమించారు.కన్వీనర్‌గా ఆర్ఎంవో-1 డాక్టర్ జయకృష్ణ, కార్యదర్శిగా డాక్టర్ శంకర్ వెంకటేశన్, ప్రతినిధులుగా ఆర్ఎంఓ డాక్టర్ సిద్ధికి. డాక్టర్ కవిత,డాక్టర్ పద్మ, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ గీత, సౌమ్యశ్రీ, హేమలత, సునీత, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శివకుమార్, మంగమ్మ, నర్సులు, పరిపాలన విభాగం ఉద్యోగులు సభ్యులుగా కొనసాగుతారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్,మార్చి 5: తుక్కుగూడ మున్సిపల్ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తైబజార్ కూరగాయల మార్కెట్, పశువుల సంత, బట్టల షాపులు, ఇతర దుకాణాలకు గురువారం రూ. 1000 రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి తెలిపారు.